క్లుప్తంగా

పరవాడ సీఐగా మల్లికార్జునరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లికార్జునరావు

పరవాడ: పరవాడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా ఆర్.మల్లికార్జునరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖ రేంజ్‌లో పని చేసి పరవాడకు బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎస్.బాలసూర్యారావును అనకాపల్లి డీఎస్‌బీ–1కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు విలేకరులతో మాట్లాడుతూ పరవాడ పారిశ్రామిక వాడలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: వ్యవసాయ విస్తరణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది'కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఆదివారం పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతాంగానికి మేలు చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఎంపిక


ఎన్నికైన హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: విశాఖ జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఆదివారం విశాఖ జిల్లాలో హెల్త్ ఎడ్యుకేటర్ల ఆత్మీయ సమావేశం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా పలాడ శివ ప్రసాద్ (తగరంపూడి పీహెచ్‌సీ), కార్యదర్శిగా సయ్యద్ బేగం (డీఎంహెచ్‌వో), కోశాధికారులుగా పి.సుబ్బలక్ష్మి, ఆర్.ఝాన్సీరాణి, ఉపాధ్యక్షుడిగా రామనాథం, జాయింట్ సెక్రటరీలుగా బి.మంగ, ఎస్.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యులుగా డి.సత్యవతి, వి.రవి ఎన్నికయ్యారు.

సినీ పరిశ్రమ విశాఖ తరలి రావాలి

దాబాగార్డెన్స్: ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల అచ్యుతరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు, ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితుడైన కంచర్లను ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితమైపోయిందన్నారు. సినీ పరిశ్రమ విశాఖకు తరలి రావాలని, ఇక్కడ ఫిల్మ్ చాంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. సెన్సార్ బోర్డును కూడా ఇక్కడే నెలకొల్పాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమైన పర్యాటక ప్రదేశాలను తెలిపారు. ముఖ్యంగా విశాఖ అందాల కోసం దర్శక, నిర్మాతలు ముందుకు వస్తున్నారని కంచర్ల పేర్కొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా, ప్రధాన కార్యదర్శి అచ్యుతరామస్వామి, చెన్నా తిరుమలరావు, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్లర్లు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. మీపై పోలీస్ నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీ నృసింహుడు కొలువైన సింహగిరికి భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. శని, ఆదివారాలే కాకుండా సాధారణ రోజుల్లో కూడా భక్తులు వందలాది బైక్‌లపై ఘాట్ రోడ్ల మీదుగా కొండకు చేరుతున్నారు. వీరి నుంచి టోల్ వసూలుకు ఆసక్తి చూపుతున్న దేవస్థాన పాలక వర్గం, ఘాట్ రోడ్లలో సౌకర్యాలపై దృష్టిసారించట్లేదు. వర్షం పడిందంటే.. ఐదేసి కిలోమీటర్ల ఇరు ఘాట్ రోడ్లలో తలదాచుకునేందుకు నిలువ నీడైనా లేదు. దీంతో వర్షాకాలంలో కొండకు వెళ్లే భక్తులు వర్షంలో తడుస్తూ.. సింహాద్రినాథుడిని చేరుకోవాల్సి వస్తోంది.

అప్పన్నా.. చినుకు పడితే తలదాచుకునేదెలా?


ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

- సింహగిరి ఘాట్‌రోడ్లలో షెల్టర్లు లేక ద్విచక్ర వాహనదారుల ఇక్కట్లు
- ఒక్కో బైక్‌కి రూ.10 చొప్పున టోల్ రుసుం వసూలు
- దేవస్థానానికి ఏటా టోల్‌గేట్ ద్వారా రూ.కోటి ఆదాయం
- ఈ ఏడాది టోల్ పాట రూ.1.20 కోట్లు
- షెల్టర్లు ఏర్పాటు చేయాలని భక్తుల విజ్ఞప్తి

సింహాచలం: వర్షం పడితే సింహగిరికి ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనాలపై వెళ్లేందుకు భక్తులు వెనుకడుగేసే పరిస్థితి. ఇరువేపులా ఉన్న ఘాట్ రోడ్లలో తలదాచుకునేందుకు చిన్నపాటి షెల్టర్ కూడా అందుబాటులో లేదు. ఏదో కొండవాలున సేదతీరుదామంటే.. వర్షపు నీటికి ఏ బండరాయి జారిపడుతుందోనని భయం. దీంతో వానాకాలంలో ద్విచక్ర వాహనదారులు సింహాద్రినాథుడి దర్శనానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘాట్ రోడ్లలో అక్కడక్కడ షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.

రోజూ వందల్లో బైక్‌లపై భక్తులు

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం కొండ దిగువ నుంచి కొండపైకి వెళ్లేందుకు రెండు ఘాట్ రోడ్లున్నాయి. సింహాచలంలో ఉన్న పాత ఘాట్ రోడ్డు, పాత అడవివరానికి సమీపంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రెండవ ఘాట్ రోడ్డు వాహనాల రాకపోకలకు అందుబాటులో ఉన్నాయి. ఇరు వేపులా దాదాపు 5 కి.మీ. పొడవున ఉండే ఈ ఘాట్ రోడ్లలో నిత్యం వందలాది ద్విచక్రవాహనాలపై భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. దేవస్థానం నిర్ణయించిన రేటు ప్రకారం ఒక్కో బైక్‌కి రూ.10 చొప్పున కాంట్రాక్టర్ టోల్‌గేట్ రుసుము వసూలు చేస్తాడు. సోమవారం నుంచి శుక్రవారం వరకు 700–800 బైక్‌లు, శని, ఆదివారాల్లో 1500 వరకు ద్విచక్ర వాహనాలపై భక్తులు సింహగిరి కొండపైకి చేరుకుంటారు. ఇక పర్వదినాలు, పండగ రోజుల్లో ద్విచక్రవాహనాల సంఖ్య మరింత ఎక్కువే. వీటితోపాటు కార్లు, మినీ బస్సులు, బస్సుల తాకిడి కూడా ఉంది.

ఆదాయం 'టోల్'డు

టోల్‌గేట్ కాంట్రాక్ట్ ద్వారా దేవస్థానానికి ఏటా భారీ ఆదాయమే సమకూరుతోంది. బహిరంగ వేలం/సీల్డ్ టెండర్ ద్వారా హెచ్చు మొత్తంలో పాట పాడుకున్న కాంట్రాక్టర్‌కి టోల్‌గేట్ నిర్వహణ బాధ్యత దేవస్థానం అప్పగిస్తుంది. అనుకున్న మేరకు పాట మొత్తం రాకపోతే వాయిదా వేస్తుందే తప్ప, వచ్చిన మేరకు అప్పగించే పరిస్థితి లేదు. 2024–25 సంవత్సరానికి రూ. కోటీ 20 లక్షల 50 వేల హెచ్చు మొత్తానికి టోల్ వేలం వెళ్లింది. కేవలం హెచ్చు మొత్తం రాకపైనే దృష్టి సారించే దేవస్థానం అధికారులు ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనాలపై వచ్చే భక్తుల కోసం షెల్టర్ల ఏర్పాటుపై మాత్రం దృష్టి సారించట్లేదు. ఘాట్‌రోడ్డులో ప్రయాణించేటప్పుడు అనుకోకుండా వర్షం పడితే ఎక్కడ తలదాచుకోవాలో తెలియని దుస్థితి. ముఖ్యంగా చిన్నారులతో వచ్చే భక్తుల పరిస్థితి మరింత దయనీయం. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఘాట్‌రోడ్డులో షెల్టర్లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రెండు ఘాట్ రోడ్లలో వచ్చే వాహనాలు, ఆదాయం(రోజుకు సగటున)

వాహనం	రుసుం	వాహనాలు	ఆదాయం
బైక్‌లు	రూ.10	1000	రూ.10వేలు
చిన్న కార్లు	రూ.30	300	రూ.9 వేలు
టాటా మ్యాజిక్	రూ.40	150	రూ.6 వేలు

(12 సీటర్ మినీ వ్యాన్(రూ.100), 24 సీటర్ మినీ బస్సు(రూ.200), లారీలు(రూ.75) బస్సులు వీటికి అదనం)

షెల్టర్లు ఏర్పాటు చేయాలి



నేను మా అక్కని, మేనల్లుడిని తీసుకుని నా బైక్‌పై సింహాచలం వచ్చాను. మా మేనల్లుడికి తలనీలాలు సమర్పించాము. ఘాట్‌రోడ్డులో కొండ దిగువకి దిగుతున్నప్పుడు పలుమార్లు చినుకులు పడ్డాయి. ప్రస్తుతం తుఫాన్ ఉండటంతో వెంట గొడుగు తీసుకొచ్చి మేనకోడలు తడవకుండా చూసుకున్నాం. సాధారణ రోజుల్లో అనుకోకుండా వర్షం పడితే ఏమీ చేయలేని పరిస్థితి. ఘాట్‌రోడ్డులో ఖచ్చితంగా షెల్టర్లు ఏర్పాటు చేయాలి. – మణిదీప్, ఆరిలోవ

కూర్చొని ప్రసాదం తినాలన్నా..



నెలలో కనీసం ఒకసారైనా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వస్తుంటా. ద్విచక్రవాహనంపై ఘాట్‌రోడ్డులో వెళ్లేటప్పుడు, మధ్యదారిలో వర్షం పడితే ఎక్కడా తలదాచుకునే పరిస్థితి లేదు. మధ్యలో ఆగిపోయినా.. ముందుకు సాగినా నిలువెల్లా తడవక తప్పదు. కనీసం కూర్చుని ప్రసాదం తినాలన్నా.. ఎక్కడా ఎలాంటి షెడ్ లేదు. ఏక్కడో ఓ మెట్ల మార్గాన్ని ఆశ్రయించాల్సిందే. భక్తుల రాక దృష్ట్యా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలి. – టి.ఈశ్వరరావు, విశాఖపట్నం

షెల్టర్ల నిర్మాణానికి చర్యలు



రెండు ఘాట్‌రోడ్డులు కలిసిన వై జంక్షన్‌లో ప్రసాద్ స్కీమ్‌లో ఒక వ్యూ పాయింట్ ఏర్పాటు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. అది ఎండా, వానలకు షెల్టర్‌గా ఉపయోగపడుతుంది. దాని నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టూరిజం అధికారులను కోరతాం. మొదటి ఘాట్‌రోడ్డులో అనువైన ప్లేస్ లేకపోవడంతో షెల్టర్ల నిర్మాణానికి వీలు కావట్లేదు. రెండవ ఘాట్‌రోడ్డులో షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

పరవాడ: దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని పరవాడ సంతబయలులో సోమవారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మండలంలో పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

అమృతఫల సంస్థకు ఉత్తమ అవార్డు


ఉత్తమ రైతు ఉత్పత్తిదారు సంఘం అవార్డు అందుకుంటున్న కందర్ప మౌక్తిక

సబ్బవరం : అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం అవార్డు వరించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్–నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ 49వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ అవార్డుకు ఎంపిక చేసి అందచేశారు. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పలు రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను పరిశీలించిన ఐసీఏఆర్–ఎన్ఏఏఆర్ఎం ప్రతినిధులు సబ్బవరంలోని అమృతఫల ఉత్పత్తిదారుల కంపెనీని గుర్తించారు. దీంతో హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ ఆడిటోరియంలో జరిగిన 49వ వార్షికోత్సవ వేడుకల్లో ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ చేతుల మీదుగా కంపెనీ సీఈవో కందర్ప మౌక్తికకు అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. దీంతో స్థానిక జాగృతి కార్యాలయంలో ఎండీ కందర్ప సుజాతను కంపెనీ చైర్మన్ పొట్నూరి అప్పారావు, పాలకవర్గ సభ్యులు తదితరులు అభినందించారు.

ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి


కొండయ్యవలస మరిడిమాంబ కూడలి వద్ద మాట్లాడుతున్న నాయకులు

అగనంపూడి: జాతీయ రహదారిపై మరిడిమాంబ (ఆంజనేయస్వామి) ఆలయ కూడలి వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలని 85వ వార్డు ప్రజా సంఘాల నాయకులు కోరారు. మరిడిమాంబ ఆలయ కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పిల్లా రవి, బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ రహదారి కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయని, ఈకారణంగా అగనంపూడి జంక్షన్‌లో వాహనాలు చిక్కుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ కారణంగా భారీ వాహనాలు వీధి రోడ్లలోకి ప్రవేశించి అదుపు తప్పిన వేగంతో వెళ్తుండడంతో భయాందోళన చెందుతున్నారని, ఈ విషయంలో నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ స్పందించి సమస్యను కొలిక్కి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బలిరెడ్డి ప్రకాష్, వద్దాది శ్రీను, బండారు చందు రమేష్, విందుల ఈశ్వరరావు, పిల్లా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఉపాధ్యాయులకు మేలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

సీతమ్మధార: సీపీఎస్ వ్యతిరేక దినాన్ని పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నాయకులు నిరసన చేపట్టారు. ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్ పథకాన్ని రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారన్నారు. గతంలో ప్రవేశపెట్టిన జీపీఎస్ పథకం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్రంలో మూడో సారి ఏర్పడిన మోదీ ప్రభుత్వం యూపీఎస్ పథకాన్ని అమలు చేయాలని చూస్తోందన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను వ్యతిరేకిస్తూ ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాత పెన్షన్ పథకమే అమలు చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు ఎస్.విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సంగీతం.. విశ్వవ్యాప్తం


తోలుబొమ్మలాట ప్రదర్శన


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎం.ఎస్ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు

మద్దిలపాలెం: పారా... ద సుప్రీమ్ 7వ వార్షికోత్సవం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీతం విశ్వవ్యాప్తమని, సంగీత విద్వాంసురాలు డాక్టర్ పంతుల రమ స్థాపించిన ఈ సామాజిక, సాంస్కృతిక చైతన్య గీతిక ఏడేళ్లుగా ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సంగీతంపై అవగాహన, ఆసక్తిని కల్పిస్తున్నాయన్నారు. గతంలో స్వచ్ఛ స్వర, స్వర 2 రాగ, స్పందన వంటి వినూత్న కార్యక్రమాలతోపాటు సంగీతానికి సంబంధించిన ఎన్నో ముఖ్య అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

అలరించిన తోలుబొమ్మలాట

వేడుకల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర తోలుబొమ్మలాట బృందం ప్రదర్శించిన రామాయణంలోని మైరావణ చరిత్ర కథ ఘట్టం అందరినీ అలరించింది. తోలుబొమ్మలాటలో సంగీతంపై పరస్పర చర్చ రసవత్తరంగా సాగింది. అనంతరం నిర్వహించిన కృతి సమీక్షలో సంగీత విద్యార్థులు, రసజ్ఞులు కర్ణాటక సంగీత రచనల్లోని సంగీతం, సాహిత్యంపై విశ్లేషణాత్మక ప్రదర్శనలు చేశారు. వీరంతా బరంపూర్, ఢిల్లీ, గోరక్‌పూర్ ప్రాంతాల నుంచి రావడం విశేషం. సమీక్షలో పాల్గొన్న వారిని పంతుల రమ, పంతుల గోపాలరావులు ప్రశంసించారు. సంగీత విద్వాంసులు, సంగీత సుధానిధి గురువిల్లి అప్పన్న నాదస్వర కచేరీతో వేడుకలు ముగిశాయి. కంచి కామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు గురువిల్లి దుర్గారావు డోలుపై సహకరించారు. ఎంతో శ్రావ్యమైన, ఆనందభరితమైన నాదస్వర–డోలు కచేరీ రసజ్ఞులను మంత్రముగ్ధులను చేసింది.

పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


చినముషిడివాడలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 'క్లీన్ ఆంధ్ర–గ్రీన్ ఆంధ్ర'కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ, పెందుర్తి మండలం గుర్రంపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెంలో ఎమ్మెల్యే ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తి స్థాయిలో మొక్కలు నాటేందుకు ప్రణాళికాయుతంగా ముందుకు వెళతామన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున్న పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కిరెడ్డిపాలెంలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి దుస్తులు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శానాపతి వసంత, నాయకులు రెడ్డి నారాయణరావు, శానాపతి శంకరరావు, సుఖవాసి అజయ్, అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

సబ్బవరం: విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వనం–మనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం లాంటి ఆస్పత్రుల్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏంతైనా ఉందన్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో ఆస్పత్రిని అభివృద్ధి చేసి, అన్ని వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, నాయకులు మిడతాడ మహాలక్ష్మినాయుడు, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ, గండి దుర్గాప్రసాద్, టి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారం 28వ రోజుకి చేరా యి. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు అమ్మవారికి శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పూజలో పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి వారి పేరు, గోత్ర నామం, చిరునామాను 8985515989 వాట్సప్ నంబర్‌కు పంపాలి.

యాదవ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు


కార్యక్రమంలో పాల్గొన్న యాదవ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం: యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో యాదవ సామాజిక వర్గ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. 10వ తరగతిలో 594 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో 986 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు అవార్డులు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు యాదవ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు బొట్ట వెంకటరమణ, ప్రగఢా చిన్నారావు, యు.రాజారావు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధాలు ఆగితేనే ప్రపంచ శాంతి సాధ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నిలిపేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆశీలుమెట్ట, లలితా జ్యూయలర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, చేపల మార్కెట్, గుడివాడ విగ్రహం మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచంలో సుదీర్ఘ కాలం పాటు రెండు యుద్ధాలు కొనసాగుతున్నాయని, దీనికి ప్రధాన సూత్రధారి అమెరికా సామ్రాజ్యవాదమని విమర్శించారు. యుద్ధాలు ఆపి శాంతి నెలకొల్పాలన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆపాలన్నారు. ప్రపంచ శాంతి కొనసాగితేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా నాయకులు పి.మణి, బి.జగన్, కుమార మంగళం, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, కె.కుమారి పాల్గొన్నారు.

ఈ ప్రయాణం ప్రమాదకరం


చినగదిలి కూడలి మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్‌లో వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: ఆర్టీసీ సిటీ బస్‌లో ప్రయాణం చాలా సుఖంగా ఉంటుంది. అదే బస్‌లో వేలాడి ఫుట్‌పాత్‌పై ప్రయాణించడమే ప్రమాదమవుతుంది. విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం కళాశాలలకు వెళ్లి వస్తున్న సమయంలో ఇదే విధంగా ఫుట్‌పాత్ ప్రయాణం చేస్తున్నారు. ఆరిలోవ నుంచి కళాశాలలకు వెళ్లి వస్తున్న విద్యార్థులు సిటీ బస్‌ల్లో ఎక్కువగా ఫుట్‌పాత్‌లపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. రన్నింగ్‌లో బస్‌లు ఎక్కడం, దిగడం చేస్తున్నారు. బస్ లోపల కూర్చోవడానికి సీట్లు ఉన్నప్పటికీ, లేదంటే నిలబడేందుకు లోపల ఖాళీ ఉన్నప్పటికీ వాటిని కాదని ఫుట్‌పాత్ ప్రయాణానికే ఆసక్తి చూపుతున్నారు. ఇలా ప్రయాణించడం ప్రమాదని తెలిసినా వారు పట్టించుకోవడం లేదు. చాలాసార్లు పలువురు విద్యార్థులు ఫుట్‌పాత్‌పై నుంచి జారిపడి గాయాలపాలైన సంఘటనలు జరిగాయి. విద్యార్థులూ ఇకనైనా ఆ ప్రయాణం మానండి, జాగ్రత్తగా ప్రయాణించండి అంటూ ఆర్టీసీ డ్రైవర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.